మహ్మద్ ప్రవక్త బాటను అనుసరిద్దాం

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : ప్రపంచానికి మార్గ నిర్దేశం చేసిన మహ్మద్ ప్రవక్త మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఖానాపూర్ జోహర మసీద్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. ప్రవక్త జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆదిలాబాద్‌లో మిలద్ ఉన్ నబి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో నిజాయితీ, పరమత సహనం, శాంతి మార్గంలో జీవించాలని ప్రవక్త సూచించారన్నారు. కార్యక్రమంలో అబుజర్, జమీర్, సమీర్, మున్న, అయ్యూబ్, ముజీబ్ పాల్గొన్నారు.

మండల కమిటీకి సన్మానం

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 16: మండల కేంద్రంలోని సర్వజనిక్ గణేశ్ మండప ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధానకార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, కమిటీ సభ్యులు మస్కే రాజ్‌వర్ధన్, పవార్ శివాజీలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బేల, సెప్టెంబర్ 16 : దుబ్బగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని టెమ్రిగూడ గ్రామానికి చెందిన మారుబాయి 15 రోజుల క్రితం నవజాత మగ శిశువుకు జన్మనిచ్చింది. నాలుగు రోజుల క్రితం ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిని కోల్పోయిన నవజాత శిశువుకు ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్ రెడ్డి పాల డబ్బాల కోసం తన వంతుగా రూ.3 వేలు ఆర్థికసాయం సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట ప్రమోద్ రెడ్డి ఉన్నారు.

పిప్పల్‌కోటిలో మహారాష్ట్ర పోలీసులు

భీంపూర్, సెప్టెంబర్ 16 : పిప్పల్‌కోటి గ్రామానికి సోమవారం మహారాష్ట్ర కిన్వట్ తాలూకా మాండ్వి పోలీసులు వచ్చారు. గ్రామానికి చెందిన నారాయణ హత్యకేసులో ఇప్పటికే ఇద్దరిని రిమాండ్‌కు పంపిన పోలీసులు కావాల్సిన సమాచారం కోసం ఇంకా దర్యాప్తు కొపసాగిస్తున్నారు. మహారాష్ట్ర ఇంటెలిజెన్స్ వారు ఈ కేసులో లోతుగా విచారణ సాగిస్తున్నారు.

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 16: లక్కంపూర్ గ్రామంలో మొదటి విడుతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూ పటేల్ అన్నారు. సోమవారం సిరికొండ మండలం లక్కంపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కదిలి ఆలయం వద్ద భూమిపూజ

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 16: మండలంలోని ప్రసిద్ధ దేవాలయమైన కదిలి పాపహరేశ్వర ఆలయం వద్ద సోమవారం దాతల సహకారంతో భక్తుల సౌకర్యార్థం గది నిర్మాణానికి ఆలయ పండితులు దాతలు కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ వెంకట్‌రావు, ఆలయ ఈవో భూమయ్య, ఆలయ అధికారులు మాధవురావు, పండితులు శంకర్, పంచాక్షరీ తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి డీజే పెట్టవద్దు

సోన్, సెప్టెంబర్ 16 : వినాయక నిమజ్జనం సందర్భంగా మోతాదుకు మించి ఎక్కువ డీజే బాక్సులు పెట్టవద్దని సోన్ ఎస్ఐ గోపి అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం ప్రారంభమైనందున డీజే బాక్సులు మోతాదుకు మించి పెట్టినచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బోథ్: కైలాస్‌టెకిడీలో మట్టి గణపతుల నిమజ్జన శోభాయాత్రలో లింబాజీ మహారాజ్, భక్తులు

బజార్‌హత్నూర్: భజన సంకీర్తనలతో గణేశ్ శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఉట్నూర్ : తరులుతున్న గణనాథులు

ఘనంగా గణేశుడి నిమజ్జనం

- శోభాయాత్రలో ఆకట్టుకున్న నృత్యాలు, కోలాటాలు, భజనలు

బోథ్, సెప్టెంబర్ 16 : బోథ్, కన్గుట్ట, పొచ్చెర, కౌఠ(బీ), కంటేగాం, కైలాస్‌టెకిడీల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఘనంగా కొనసాగింది. విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపులో భక్తుల నృత్యాలు, కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సమీప వాగుల్లో వినాయకులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

భీంపూర్, సెప్టెంబర్16 : మండలంలోని కరంజి(టీ), గుబిడి, అంతర్గాం, నిపాని గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున వినాయక నిమజ్జనాలు చేశారు. ఆదివారం రాత్రి నుంచి మొదలైన నిమజ్జన వేడుకలు సోమవారం ముగిశాయి. సమీప వాగులు, పెన్‌గంగలో ఈ ప్రక్రియ నిర్వహించారు. భీంపూర్ తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ హరీశ్, ఎస్ఐ కలీం నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షణ చేశారు.

ఉట్నూర్, సెప్టెంబర్ 16 : ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం గణనాథుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. స్థానిక వినాయక చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ఎంపీ నగేశ్, స్థానిక ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేశారు. దీంతో గణనాథుల శోభాయాత్ర ప్రారంభమైంది. వినాయక్‌చౌక్ మీదుగా పోచమ్మవాడ ద్వారా గంగన్నపేట్ చెరువులో నిమజ్జనం చేశారు. శోభాయాత్ర సాఫీగా సాగేందుకు ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ గౌడ్ భారీగా బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిళి, ఎస్ఐ మనోహర్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, కార్యకర్తలు, గణనాథుల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 16: బజార్‌హత్నూర్‌లోని పూలజీబాబా కాలనీలో గణనాథుడిని సోమవారం పూలాజీబాబా భక్తులు కాలనీవాసులు, గ్రామస్తులు భజన కార్యక్రమాలు ఆధ్యాత్మిక సంకీర్తనలతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సయ్య, ఆదివాసీ నాయకులు జల్కె పాండురంగ్, సందీప్, గంగాధర్, భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి మార్గాలను అనుసరించాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 16: గణేశ్ నిమజ్జనం సందర్భంగా యువత శాంతి మార్గాలను అనుసరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రధాన్‌గూడ, ఎస్టీగోండ్‌గూడ, వడ్డెరకాలనీ, మండల కేంద్రంలోని సర్వజనిక్ గణేశ్ మండపాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండపాలతో పాటు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను వేర్వేరుగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామపటేల్, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే, ప్రధాన్‌గూడ పటేల్ జ్ఞానేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, వ్యాపారుల సంఘం మండలాధ్యక్షుడు చింతవార్ సంతోష్, గణేశ్ మండపాల ఉత్సవ కమిటీ సభ్యులు దీప్‌సింగ్, ప్రకాశ్, కిశోర్‌కుమార్, చంపత్‌పటేల్, సోయం రాందాస్, దేవ్‌పూజే మారుతి, కేశవ్‌పటేల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మాజీ మండలాధ్యక్షుడు నాగోరావ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, పట్టణ అధ్యక్షుడు ఎంవీ జహీర్, కేస్లాపూర్ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, జిల్లా నాయకులు జితేందర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: సర్వజనిక్ గణేశ్ మండపంలో పూజలు చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్

ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 16: జైనూర్ ఘటనలో బాధిత మహిళకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో చర్చలు జరపాలని ఆదివాసీ నాయకులు పెందూర్ ప్రభాకర్, సిడాం గంగాధర్, మంగం విషంరావ్, కొడ్డు, నిరంజన్, బొంత ఆశారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ రవి, లక్ష్మణ్, గజానంద్ ఉన్నారు.

కమిటీ హాల్ నిర్మాణానికి కృషి

ఉట్నూర్, సెప్టెంబర్ 16: కమిటీ హాల్ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఖానాపూన్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ సేవదాస్‌నగర్‌లోని జగదాంబ ఆలయంలో జగదాంబదేవి, సేవలాల్ మహారాజ్, గణనాథుడిని పూజించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కలిసి కట్టుగా ముందుకు పోదామన్నారు. తీజ్ ఉత్సవ నృత్యాలలో పాల్గొని అలరించారు. కార్యక్రమంలో నాయకులు, బంజారా మహిళలు పాల్గొన్నారు.

పాలజ్ గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు



భైంసా: పూజలు చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

భైంసా/నేరడిగొండ, సెప్టెంబర్ 16 : పాలజ్ గణపతిని సోమవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతించి వారిని శాలువాతో సత్కరించారు. అంతకుముందు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ నివాసానికి రావడంతో ఆయనను రామరావు పటేల్ పూలమాల శాలువాతో సత్కరించారు.

తానూర్, సెప్టెంబర్ 16 : బోసి గ్రామంలో శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడిని ఆదివారం రాత్రి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ దర్శించుకున్నారు. కర్ర వినాయకుడికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రామారావుపటేల్‌ను శాలువాతో సన్మానించారు. వారి వెంట బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు శివాజీపటేల్, పట్టేపురమ్ సతీశ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బోథ్, సెప్టెంబర్ 16: మర్లపెల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పేకాటాడుతున్న ఆరుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.15950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మున్నూరు కాపు సంఘం భవనానికి రూ.10 లక్షలు మంజూరు

రాజ్యసభ సభ్యుడితో మాజీమంత్రి, మాజీ ఎంపీపీ

బోథ్, సెప్టెంబర్ 16 : సోనాలలో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్యసభ ఎంపీ నివాసంలో మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి మున్నూరు కాపు సంఘం భనవ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. స్పందించిన ఆయన వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు సోనాల మున్నూరు కాపు సంఘం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతిని కాపాడేలా పండుగలు నిర్వహించాలి

మట్టి వినాయకుడి వద్ద జన విజ్ఞాన వేదిక సభ్యులు

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : ప్రకృతిని కాపాడే విధంగా పండుగలు నిర్వహించాకోవాలని జనవిజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ కన్వీనర్ రామగిరి శివకుమార్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని నకాశీ గణేశ్ మండలి సభ్యులను జనవిజ్ఞాన వేదిక తరపున సన్మానించారు. నకాశీ మండలి సభ్యులు మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఇతర గణేశ్ మండలి సభ్యులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటపర్తి ఊశన్న, నాయకులు నాగారాజు, సురేశ్, శ్రీనివాస్, లింగన్న, వినోద్, రాకేశ్, నాగోరావ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

భైంసా, సెప్టెంబర్ 16 : భైంసాలో గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరగడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్‌తో పాటు పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం చేసిన సేవలను అభినందించారు.

భైంసా, సెప్టెంబర్ 16 : భైంసాలో గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ఏఎస్పీ అవినాశ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సహకారంతో, హిందూ ఉత్సవ సహకారంతో విజయవంతమైందని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

అమరుల త్యాగాలు మరువద్దు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 16 : తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు మరువవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి విలాస అన్నారు. సోమవారం నిర్మల్‌లోని కురన్నపేట్ కాలనీలోని తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వారికి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగిన సాయుధ పోరాటంలో కామ్రేడ్ శంకర్, మాజీ శాసన సభ్యులు, నిర్మల్ ప్రాంతంలో ముడుసు ఎల్లయ్య, గోపిడి గంగారెడ్డి, మాజీ శాసన సభ్యులు ముత్యం రెడ్డి కలిసి పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ నెల 19న ముథోల్, తానూర్, 20న భైంసా, నర్సాపూర్, 21న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

ఖానాపూర్, సెప్టెంబర్ 16 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయనున్నట్లు మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రాజగంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సచివాయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అవిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం, నిరసన చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

ఖానాపూర్, సెపెంబర్ 16: ఖానాపూర్‌లో మంగళవారం నిర్వహించే గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సోమవారం మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సులభతరం చేయడానికి గోదావరి వద్ద మున్సిపల్ అధ్వర్యంలో క్రేన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు గజ ఈతగాళ్లతో పాటు విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని అన్ని మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటిస్తూ ప్రశాంతంగా చేపట్టాలని కోరారు.

నేడు కుభీర్‌లో వినాయక నిమజ్జనం

కుభీర్, సెప్టెంబర్ 16 : కుభీర్‌తో పాటు పల్సి, నిగ్వ, సిర్పెల్లి(హెచ్) గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జనం ఉండడంతో కుభీర్ ఎస్ఐ రవీందర్ బందోబస్తును ఏర్పాటు చేశారు. శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలని ఆయన సూచించారు.

గణేశ్ మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

ఖానాపూర్, సెప్టెంబర్ 16: ఖానాపూర్ పట్టణ, మండలంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలపై తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ రాంసింగ్ సూచించారు. సోమవారం ఖానాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గణేశ్ శోభాయాత్రలో విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ కలెక్షన్ పెట్టరాదన్నారు. ట్రాక్టర్లలో గణేశ్ విగ్రహాల వెనుకభాగంలో ఎత్తైన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి శోభాయాత్రగా వెళ్లడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. శోభాయాత్రలో అడ్డుగా విద్యుత్ వైర్లు ఉన్నచో తమ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

బోరు ఏర్పాటు

ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 16: ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో నూతన బోర్లు ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అన్నారు. సోమవారం ఒకటో వార్డులో నూతన బోరు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, సాడిగె రమణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, SHAIK ASEEF, R/o. H.No. 1/1, Kokas Mannur, Adilabad District, Telangana-504 307, T.S. have Changed My Name to SHAIK ASIF S/o. Shaik Salar.
NT-335808

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

సోలార్ కంచె బ్యాటరీలు చోరీ

కుభీర్, సెప్టెంబర్ 16 : కుభీర్ మండలం జాంగాం గ్రామంలో పంట చేన్లను అడవి జంతువుల నుంచి రక్షణ కోసం వేసుకున్న సోలార్ కంచె బ్యాటరీలను దొంగలు ఎత్తుకు పోయారు. జాంగాంలోని సగ్గం వెంకన్న, సగ్గం లక్ష్మణ్, సింధే దత్తురాం పటేల్‌కు చెందిన సోలార్ బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు.

పేద మహిళకు అంత్యక్రియలు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 16: నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన మగ్గిడి లక్ష్మి(70) గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. పేద మహిళ కావడంతో స్థానికులు నిర్మల హృదయ సేవా సమితికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అక్కడికి సమితి సభ్యులు చేరుకొని వారి సాంప్రదాయ ప్రకారం అంతిమయాత్ర, శవదహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ సాదం ఆనంద్, యాటకారి సాయన్న, వెంకటేశ్వర్ రావు, ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం

ఎదులాపురం, సెప్టెంబర్ 16: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ తెలిపారు. సోమవారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కూర పొచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా కాంబ్లే లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రాచర్ల నారాయణ, కోశాధికారిగా మోర వెంకట్, గౌరవాధ్యక్షుడిగా సూర్యవంశం నాందేవ్, కార్యదర్శులుగా రాథోడ్ మదన్ లాల్, గెడెం నాగోరావ్, మహిళా కార్యదర్శిగా దూలూరి అనురాధ, మెంబర్స్‌గా దర్శనాల భాగ్యవతి, శ్రీకాంత్, అట్ల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పెంటపర్తి ఊశన్న ఉన్నారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మారుపాక భీమయ్య, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాలు మూసివేత

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : ఆదిలాబాద్‌లో ఈ నెల 17వ తేదీన మద్యం దుకాణాలు మూసి వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. పట్టణంలో మంగళవారం వినాయక నిమజ్జనం శోభాయాత్రను పురస్కరించుకొని కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం వ్యాపారులు ఎవరైనా ఈ సమయాల్లో విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి బుధవారం యథావిధిగా దుకాణాలు తెరుస్తారని పేర్కొన్నారు.

108లో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 16: 108 వాహనంలో మహిళ ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. సిరికొండ మండలం సూర్యపేట్ గ్రామానికి చెందిన జంగుబాయికి సోమవారం ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. వెళ్లి ప్రసవవేదన భరిస్తున్న తల్లిని వాహనంలో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. 108 ఈఎంటీ సురేశ్, పైలెట్ రాథోడ్ గోపాల్ చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని, వారిని ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించినట్లు ఈఎంటీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పురంశెట్టి రాజారాం (ఫైల్

కుభీర్, సెప్టెంబర్ 16 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం కుభీర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్సి గ్రామానికి చెందిన పురంశెట్టి రాజారాం(27) పని నిమిత్తం తన పెదనాన్న కుమారుడు పరశురాంతో కలిసి బైక్‌పై కుభీర్ వెళ్తున్నాడు. కుభీర్ నుంచి పల్సికి వస్తున్న మహీంద్ర మ్యాక్స్ వాహనం ఢీ కొనడంతో రాజారాం తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న పరశురాంకు స్వల్ప గాయాలయ్యాయి. మ్యాక్స్ వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా అతి వేగంగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. మృతుడికి తండ్రి గజ్జారాం, తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. హార్వెస్టర్, ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజారాం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పల్సి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బస్సులో చోరీ

ముథోల్, సెప్టెంబర్ 16: బాసర నుంచి భైంసా వైపు వెళ్తున్న బస్సులో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బస్సులోని గుర్తు తెలియని వ్యక్తులు మూడు సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. వెంబడే ఆర్టీసీ డ్రైవర్ నేరుగా ముథోల్ పోలీస్ స్టేషన్‌కు బస్సును తీసుకువచ్చారు. పోలీసులు బస్సును తనిఖీ చేసినా సెల్‌ఫోన్లు దొరకలేదు. చోరీ చేసిన వ్యక్తిని పట్టుకోవాలని బాధితులు కోరారు.

కారును ఢీ కొట్టిన లారీ

ఇచ్చోడ, సెప్టెంబర్ 16 : ఇచ్చోడ మండలంలోని జాతీయ రహదారి 44పై ఫైర్ స్టేషన్ వద్ద రోడ్డు ప్రమాద